ముక్కుపుటాలు అదిరిపోతున్నాయ్..

- కంపుకొడుతున్న శివారు ప్రాంతాలు
- కోళ్ల వ్యర్థాలను వదిలేస్తున్న వ్యాపారులు
- రోగాల బారిన ప్రజలు
- నోటీసులు జారీచేసినా మారని తీరు
- రాత్రిపూట వ్యర్థాల తరలింపు
- పట్టించుకోని అధికారులు



గిద్దె చెరువు కట్టపై వదిలేసిన వ్యర్థాలు



ఎల్లారెడ్డిపేట శివారులో వదిలేసిన వ్యర్థాలు

ఎల్లారెడ్డిపేట: కోళ్ల వ్యర్థాలతో వెదజల్లే దుర్గంధం ప్రజలకు శాపంగా మారుతోంది. చికెన్ సెంటర్ల నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా రాత్రిపూట వదిలేస్తున్న వ్యర్థాలతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని అన్ని వైపులా వ్యర్థాలు పడేస్తుండడంతో మండల కేంద్రంతోపాటు రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్ వైపు వెళ్లే వారు ముక్కుమూసుకోవాల్సిందే.

రాత్రిపూట వ్యర్థాల తరలింపు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాచర్లగొల్లపల్లిల్లోని చికెన్ సెంటర్లు రోజంతా వ్యాపారంతో బీజీగా ఉండడంతో కోళ్ల వ్యర్థాలను దుకాణంలోనే ఒక చోట ఉంచి రాత్రి పొద్దుపోయిన తరువాత శివారు ప్రాంతాల్లో పడేస్తున్నారు. వ్యర్థాలు కుళ్లిపోయి వాటి నుంచి వస్తున్న దుర్వాసన ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు భరించలేకపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో చినుకులు పడి వ్యర్థాలు కుళ్లిపోయి ఆ ప్రాంతానికి వెళ్లగానే వాంతులు అయ్యేంత దుర్వాసన వస్తోంది. మండల కేంద్రలోని గిద్దె చెరువు నీరు వ్యర్థాలతో కలుషితమవుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజు చెత్త బండ్లు ఈ గ్రామాలలో తిరిగి చెత్తను సేకరిస్తున్నాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెత్తబండీకి కోళ్ల వ్యర్థాలను ఇవ్వకుండా ఇలా శివారు ప్రాంతాల్లో పడేస్తున్నారు.

నోటీసులు జారీ చేసినా స్పందన కరువు

కోళ్ల వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్న చికెన్ సెంటర్ల నిర్వాహకులపై ప్రజలు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో స్పందించిన పంచాయతీ అధికారులు సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. నెల రోజులుగా నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీచేస్తున్నా స్పందించడం లేదు. నిర్వాహకులకు జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితులు ఉండవని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా చికెన్ సెంటర్ నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యర్థాలను డంపు యార్డుకు తరలించాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో అనారోగ్యం



చికెన్ సెంటర్ల నిర్వాహకులు గిద్దె చెరువు, శివారు ప్రాంతాలలో వ్యర్థాలను పడేస్తున్నారు. సమీపంలో నివాసం ఉంటున్న వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. కోళ్ల వ్యర్థాలతో వచ్చే దుర్వాసనతో పర్యాటకులు గిద్దెచెరువు ప్రాంతానికి వెళ్లలేకపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలి.

– చల్ల సత్యంరెడ్డి, ఎల్లారెడ్డిపేట

చర్యలు తీసుకుంటాం



గ్రామ శివారులో కోళ్ల వ్యర్థాలను వదిలేస్తున్నట్లు మా దృష్టికొచ్చింది. ముందుగా చికెన్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు జారీచేస్తాం. అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. ఉదయం దుకాణాల ముందుకొచ్చే చెత్త బండికి వ్యర్థాలను అందించాలి. వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలేసే వారిపై నిఘా పెట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించాం.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

పార్టీ బలోపేతానికి కృషిచేస్తా



బండ మల్లేశంను సన్మానిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడరూరల్: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశంయాదవ్ అన్నారు. జిల్లా బీజేపీ కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. వేములవాడ రూరల్ ఎంపీపీగా, సీనియర్ బీజేపీ నాయకుడిగా ఉన్న బండ మల్లేశంకు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గానికి ఉపాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సీనియర్ జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేములవాడలో మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, మాజీ ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, రేగుల మల్లికార్జున్ ఆయనను సత్కరించారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి



వేములవాడ: యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలని, ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకంలో రుణాలు ఇస్తుందని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మల్లారం రోడ్డులో సూపర్‌మార్కెట్–2 ను ఆయన సెస్ డైరెక్టర్ నామాల ఉమాలక్ష్మిరాజం, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, నిర్వాహకులు తాటిపెల్లి శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఇప్పటికే సూపర్ మార్కెట్ ద్వారా 48 మందికి ఉపాధి కల్పిస్తున్న తాటిపెల్లి శ్రీనివాస్ మరో బ్రాంచ్‌తో మరో 50 మందికి ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. టౌన్ సీఐ వీరప్రసాద్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతోపాటు ఫైర్, మున్సిపల్ అధికారులు, పురప్రముఖులు, వ్యాపారులు, పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 40 మందికి కంటి వైద్యపరీక్షలు చేయగా, ఆరుగురిని ఆపరేషన్ కోసం వారిని కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోలిపాక నర్సయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఆపరేషన్లను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి శ్రీనివాస్, శేఖర్, గోస్కుల రవి, రోమాల ప్రవీణ్, అడ్డిక జైపాల్ రెడ్డి, దాన తిరుపతి, పసుల అంజయ్య, గోపు రమేశ్, సుంకరి నరేందర్, రేకుర్తి ఆసుపత్రి వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



తంగళ్లపల్లి: పంద్రాగస్టు సందర్భంగా మండలం నుంచి ఉత్తమ ఉద్యోగులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా అవార్డు అందుకున్న మండల పంచాయతీ అధికారి మీర్జా అహ్మద్ అఫ్జల్ బేగ్, తంగళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి మహ్మద్ సమీర్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు చుక్క రాజశేఖర్, చెన్నమనేని ప్రశాంత్, సుద్దాల శ్రీనివాస్, రాపెల్లి ఆనందం, మోర కిరణ్, కరుణాకర్ గౌడ్, మహేందర్, తదితరులున్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేయండి

సిరిసిల్ల అర్బన్ : ఇందిరా మహిళాశక్తి పథకం కింద కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరయ్యాయని, నాలుగు రోజుల క్రితం కుట్టు మిషన్లు తీసుకెళ్లాలని అధికారులు ఫోన్‌చేశారని, పంపిణీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ గేట్ వద్ద ముస్లిం మహిళలు బైఠాయించారు. విషయం తెలుసుకున్న మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు అక్కడికి చేరుకొని ఇంకా కొన్ని యూనిట్లు ఉన్నాయని, వాటిని త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పద్మశాలీ సంఘం ఎన్నికల స్టే ఎత్తివేత

సిరిసిల్లకల్చరల్: పట్టణంలో పద్మశాలీ సంఘానికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియపై కోర్టు విధించిన స్టే సోమవారం ఎత్తివేసింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కోర్టు గతనెలలో స్టేటస్ కో ఆర్డర్ జారీచేసింది. యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూనే అడ్‌హాక్ కమిటీ సభ్యులు, ఎన్నికల అధికారిని ప్రతివాదులుగా చేర్చి ఈనెల 4న కౌంటర్ దాఖలుకు అవకాశం ఇచ్చింది. విచారణ సోమవారానికి వాయిదా వేసింది.

సభ్యుల ఆమోదం లేకుండానే..

ఆరేళ్ల తర్వాత పట్టణ పద్మశాలీ సంఘానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన సంఘం పెద్దలు 9,600 మందిని తాజాగా సభ్యులుగా చేర్చింది. సర్వసభ్య సమావేశంతో సంబంధం లేకుండా చేసిన తీర్మానాల మేరకు అడ్‌హాక్ కమిటీని నియమించారు. ఓటర్ లిస్టును సవరించలేదు. అభ్యర్థిత్వాల ఫీజును భారీగా పెంచారు. అధ్యక్షుడికి 50వేలు, కార్యదర్శికి 40, ఉపాధ్యక్షుడికి 30, కోశాధికారి, సహాయ కార్యదర్శి స్థానాలకు రూ.25వేలు, 39 డివిజన్ల డైరెక్టర్ల స్థానాలకు ఒక్కోదానికి రూ.15వేలు విధించారు. జరిగిన పరిణామాలు వివరిస్తూ చిమ్మని ప్రకాశ్, కోడం రవి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో స్టేటస్ కో ఆర్డర్ జారీచేసింది. సోమవారం ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం స్టేటస్ కో ఎత్తివేస్తూ ఆర్డర్ జారీచేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియను కొనసాగించే వీలుకలిగింది.

సన్మానం

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్‌కు ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా కళాశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్, అంజయ్య, దేవయ్య, రవీందర్, మహేందర్, భరత్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, గోపి, తదితరులు ఉన్నారు.

యూరియా కోసం బారులు



కోనరావుపేట: మండలకేంద్రంలోని సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారని తెలియడంతో రైతులు తెల్లవారుజామునే వెళ్లి క్యూలైన్ కట్టారు. కార్యాలయంలో 400 బస్తాలు ఉండడంతో మిగిలిన రైతులు మధ్యాహ్నం పూట నిరాశతో వెనుదిరిగారు.

సంక్షిప్త వార్తలు

• చేప పిల్లలు పంపిణీ చేయాలి

ఇల్లంతకుంట: చెరువులు కుంటలు, ప్రాజెక్టులు నిండుతున్నాయని, తక్షణమే ప్రభుత్వం చేపపిల్లలు పంపిణీ చేపట్టాలని ఇల్లంతకుంట మత్స్యకార సొసైటీ సభ్యుడు కోనబోయిన రఘు అన్నారు. సోమవారం ఆయన ఇల్లంతకుంట మండలకేంద్రంలో మాట్లాడారు.

• ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు

ఇల్లంతకుంట: మండలంలోని సిరికొండ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సత్తయ్యను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీవో శశికళ సోమవారం తెలిపారు.గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకోవడం, కూలీలకు డబ్బులు చెల్లింపులో జాప్యం చేస్తున్నాడని గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకున్నట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

• లడ్డూ వేలం

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తాడూర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో కృష్ణుడి లడ్డూను గొట్ల మధు యాదవ్ రూ.20 వేలకు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మిరాల భాస్కర్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య, బండి దేవేందర్ యాదవ్, మందాటి తిరుపతి యాదవ్, జక్కుల నాగరాజు యాదవ్, అర్కుటి మల్లేశం యాదవ్, మహేశ్ యాదవ్, ఐలయ్య యాదవ్, లచ్చయ్య, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

• ఆలయానికి మెట్ల ఏర్పాటు

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం మెట్ల వద్ద సిమెంట్‌తో ర్యాంప్ పోయించారు. పురాతన ఆలయం వద్ద మెట్లు సరిగా లేకపోవడంతో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సిమెంట్‌ను రాంప్‌లా పోయించి రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పొట్లపల్లి సత్యనారాయణరావు, అధ్యక్షుడు కొమ్ము తిరుపతి, ఆసరి రాజ్‌కుమార్, దేవరాజ్, గంగుల ప్రశాంత్, మల్యాల సుమన్, వెలిశాల రవీందర్, గడ్డం జలేందర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

21నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల పరిధిలోని ఎస్‌జీఎఫ్ పాఠశాల క్రీడాపోటీలు ఈనెల 21,22,23 తేదీల్లో వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని నిర్మల హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బాణాల సదానందం తెలిపారు. 21న బాలికలకు అండర్ 14, అండర్ 17విభాగంలో కబడ్డీ వాలీబాల్, ఖోఖో, 22న బాలురకు యూ 14, అండర్ 17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, 23 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికవుతారన్నారు. మరిన్ని వివరాలకు 9133 947242 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థినులు

వేములవాడరూరల్: హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట విద్యార్థినులు బుర్ర తపస్వి, ఆకుల భవ్యశ్రీ ఈ పోటీల్లో పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. గర్ల్ చైల్డ్ సెల్ఫ్ డిఫెన్స్ మూడు నెలల ట్రైనింగ్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో హన్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు పతకాలు సాధించారు. మాస్టర్ కనికరపు రాజశేఖర్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీకాంత్ రావు, గ్రామస్తులు అభినందించారు.

చిరుజల్లులే..

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం ముసురువర్షం కురిసింది. ముస్తాబాద్‌లో అత్యధికంగా 13.7 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 2.8, చందుర్తిలో 0.8, బోయినపల్లిలో 1.1, వేములవాడ రూరల్‌లో 0.8, వేములవాడలో 0.2, సిరిసిల్లలో 6.2, కోనరావుపేటలో 5.6, వీర్నపల్లిలో 0.3, ఎల్లారెడ్డిపేటలో 3.7, గంభీరావుపేటలో 11.1, తంగళ్లపల్లిలో 2.4, ఇల్లంతకుంటలో 1.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు లబ్ధి



ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అక్కపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి లబ్ధిదారులు కడప పెట్టుకునే కార్యక్రమానికి నాయకులు హాజరయ్యారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు మందాటి శ్రీశైలం, మెండే శ్రీనివాస్, గంట బుచ్చాగౌడ్, భూంరెడ్డి, పోతుల భాస్కర్, జనార్దన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

వేములవాడ: వేములవాడ పట్టణంలోని నాలుగో వార్డులో కొద్ది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదని, ఉన్న బోరు చెడిపోయిందని సత్వరమే తమకు నీటి సరఫరా పునరుద్ధరించాలని పేర్కొంటూ మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాలనీకి చెందిన 30 మంది మహిళలు సమస్యను కమిషనర్‌కు విన్నవించారు.

రోడ్డు మరమ్మతు



ఇల్లంతకుంట: ఇల్లంతకుంట– అనంతారం మధ్య బిక్క వాగుపై నిర్మించిన బ్రిడ్జి సమీపంలో రోడ్డు కోతకు గురికావడంతో ప్రమాదకరంగా రోడ్డు అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది.

సాక్షి స్పందన

స్పందించిన అనంతారం మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత ప్రమాదకరంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న కయ్యను మట్టితో పూడ్చి వేయించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

వేములవాడఅర్బన్: వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఇప్పటి వరకు 580 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా 450 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. యూరియాను రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు.



కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో ప్రధాన రహదారిపై మురుగునీరు నిలుస్తోంది. కొన్నేళ్లుగా మురుగునీరంతా రోడ్డుపైకే రావడంతో మండలకేంద్రానికి వెళ్లే మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడుతుండడంతో నీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది. మురుగుకాలువ నిర్మించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
ఎండీ ఆరిఫ్ పాషా ఎంపీవో సెల్ : 9989249855

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తా

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట: అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయ అభివృద్ధి మిగులు పనులు పూర్తి చేయిస్తానని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కోలాపురి అంతగిరి, ఈవో మారుతీరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, అల్లెపు రజనీకాంత్, రమణారెడ్డి, గుడిసె ఐలయ్య, వెంకటి, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పుష్పలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెల్త్ క్లబ్, ఎన్ఎస్ఎస్, వేములవాడ పబ్లిక్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ప్రిన్సిపాల్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ కరుణ, శారద, శకుంతల, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్, సూపర్‌వైజర్ రషీద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు నివాళి

సిరిసిల్ల అర్బన్/కోనరావుపేట/బోయినపల్లి/తంగళ్లపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పాపన్న ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని గౌడసంఘం నాయకులు కోరారు. గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గంభీరావుపేట : చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



ముస్తాబాద్‌లో పాపన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గీత కార్మికులు



తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలో ..



బోయినపల్లిలో..

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎల్లారెడ్డిపేట: వివిద్యార్థులు చిన్నప్పటినుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని ఎన్నారై రాధారపు సత్యం అన్నారు. మండలంలోని అల్మాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 120 మంది విద్యార్థులకు సోమవారం యూనిఫాంలను అందజేశారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని చదువులో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో లోకుర్తి తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి తరలింపు

గంభీరావుపేట: తుుండలంలోని పెద్దమ్మ అటవీ ప్రాంతంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఇరువురు మహిళలకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లాకు చెందిన మహిళలు కాగా చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



వేములవాడ అర్బన్: వేములవాడ మండలం అనుపురంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, నాయకులు ఎర్రం రాజు, సత్తయ్య, అగయ్య, బస రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.



సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899